క్లుప్తంగా

ఆర్మీ జవాన్‌కు సన్మానం



జవాన్‌ను సన్మానిస్తున్న ఉపాధి కూలీలు

బయ్యారం: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని బయ్యారం వచ్చిన ఆర్మీ జవాన్ అజహార్‌ను సోమవారం ఉపాధి హామీ కూలీలు సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ భాష్‌సింగ్ పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాం నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం మానుకోట రైల్వేస్టేషన్ ఆవరణలో నాల్గో నంబరు ప్లాట్‌ఫాం నిర్మించాలని కోరుతూ ఏడీఆర్‌ఎం గోపాలకిషన్‌కు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచ్యువల్ శ్యాంసుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ సోమవారం వినతిపత్రం అందజేశారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు

తొర్రూరు రూరల్: మద్యం మత్తులో ఘర్షణ పడి ఓ యువకుడిని హత్య చేసిన కేసులో ఐదుగురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై ఉపేందర్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఈనెల 23న ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారి సమీపంలోని చెర్లపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అర్ధరాత్రి మద్యం మత్తులో యువకుల మధ్య జరిగిన గొడవలో మాటేడు గ్రామానికి చెందిన శివకుమార్ అనే యువకుడు తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇట్టి కేసులో పత్తేపురం, తొర్రూరు, పెద్దముప్పారం గ్రామాలకు చెందిన తిరుపతి అజయ్, తిరుపతి ప్రదీప్, తిరుపతి సంతోష్, దాసరి రాజు, ఎండీ సుఫియాన్ అనే యువకులపై కేసు నమోదు చేసి విచారణ అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల జేఏసీ ఏర్పాటు



కురవి: రాష్ట్రంలోని మూడు పంచాయతీ సెక్రటరీల సంఘాలు కలసి కురవి, సీరోలు మండలాల పంచాయతీ సెక్రెటరీలు ఉమ్మడి కురవి జేఏసీగా సోమవారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా గుగులోత్ రాము, గౌరవ అధ్యక్షుడిగా కుచన సతీష్, ప్రధాన కార్యదర్శిగా జటంగి రమేష్, కోకన్వీనర్స్‌గా వాంకుడోత్ శ్రీహరి, డి.వెంకటేశ్వర్లు, సభ్యులుగా ఊరుగొండ రాజు, ఎండీ కరిష్మా, రజిత, వెంకటేష్, తుపాకుల అశోక్‌లను ఎన్నుకున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

మహబూబాబాద్: తొర్రూరు మండలంలోని 380మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చిన స్థలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మాణం చేశారని, ఆ ఇళ్లు పేదలకు కేటాయించాలని సీపీఎం తొర్రూరు మండల కార్యదర్శి ఎండీ యాకుబ్ డిమాండ్ చేశాడు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాధితులు వరలక్ష్మి, శోభ, సరోజ, యాకమ్మ, అరుణ, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

మరిపెడ: జూన్ 4వ తేదీన తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. ఈ మేరకు మరిపెడలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, రాష్ట్ర సహాయ కార్యదర్శి రామయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

గూడూరు: ఆపరేషన్ కగార్ పేరిట జరిగిన అన్ని ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. ఐదు రోజులుగా బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన శవాలను గమనించిన వారి మిత్రులు ఇవి బూటకపు ఎన్‌కౌంటర్ అని ప్రకటించారని తెలిపారు.

చెక్కుల పంపిణీ

మరిపెడ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మండలంలోని ఎల్లంపేట కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గండి వీరభద్రం అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లంపేట గ్రామంలో పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

బాబోయ్ కోతులు..!

- ఇళ్లలోకి చొరబడి ప్రజలపై దాడులు
- పంటలను ధ్వంసం చేస్తున్న వానరాలు



అమ్మాపురం గ్రామంలో సంచరిస్తున్న కోతుల గుంపు

తొర్రూరు రూరల్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఇళ్ల చుట్టూ గుంపులు గుంపులుగా కోతులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనతో జీవిస్తున్నారు. ప్రధానంగా తొర్రూరు డివిజన్ వ్యాప్తంగా గ్రామాల్లో మనుషులపై కోతులు దాడులు చేస్తూ ఇళ్లలోకి చొరబడుతూ తిండి పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. అంతేకాకుండా చిన్న పిల్లలు ఒంటరిగా ఇంటినుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే పెద్దవాళ్ల సహాయంతోనే బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నిత్యం గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలందరు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని, ఎప్పుడు ఏ కోతి దాడి చేస్తుందో అని భయంతో బతుకుతున్నారు.

పంటలను ధ్వంసం చేస్తున్నాయి..

మరో పక్క గ్రామాల శివారుల్లో సాగు చేస్తున్న అనేక రకాల పంటలను సైతం కోతులు ధ్వంసం చేస్తున్నాయి. కొన్ని గుంపులు ఇళ్లలో సంచరిస్తుంటే, మరికొన్ని గుంపుల కోతులు సాగు చేస్తున్న అనేక రకాల పంటల వైపు తిరుగుతూ సర్వ నాశనం చేస్తున్నాయి. ప్రస్తుతం సాగు చేస్తున్న మొక్కజొన్న, పజొన్న, పల్లికాయ, కూరగాయాలు, పత్తి, వరి పంటలను నాశనం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో కోతుల బెడద లేకుండా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

భయంతో జీవిస్తున్నాం..



గ్రామాల్లోని ఇళ్ల మీదనే కోతులు సంచరించడంతో భయంతో జీవిస్తున్నాం. ఇళ్లలోకి చొరబడి తిండి పదార్థాలను తీసుకెళ్తున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరిపై దాడి చేస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం మిగులుస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాల్లో కోతుల బెడద లేకుండా చేయాలి.

– కొత్తూరు రాజేందర్, గుర్తూరు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్: అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో మూడు కోట్ల జంక్షన్, ముత్యాలమ్మ గుడి సెంటర్, కురవి రోడ్డులో నిర్మాణం చేయనున్న మూడు జంక్షన్ల పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూడు జంక్షన్‌ల నిర్మాణానికి రూ.75లక్షలు, వివేకానంద సెంటర్, వైఎస్‌ఆర్ సెంటర్‌లో ఉన్న జంక్షన్‌ల సుందరీకరణ పనులకు రూ.30లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ కుమార్, అజయ్‌సారథిరెడ్డి, విజయసారధి రెడ్డి, రామగోని రాజు పెరుగుకుమార్, రామరాజు శంతన్, చింతకుంట్ల వెంకన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మితో ఆర్థిక చేయూత

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల: ప్రభుత్వ అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డల తల్లులకు ఆర్థిక చేయూత లాంటిదని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం గార్ల పీఏసీఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వల్లమూడి దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, కట్టా శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఎం వెంకట్‌లాల్, ఏఎంసీ డైరెక్టర్ అశోక్, తహసీల్దార్ ఆర్ శారద, ఎంపీడీఓ మంగమ్మ, ఏడీఏ శ్రీనివాస్, ఏఓ రామారావు, నాయకులు పాల్గొన్నారు.

యువతరం ఉద్యమంలోకి రావాలి



మాట్లాడుతున్న సాంబశివ

మరిపెడ: యువతరం కమ్యూనిస్టు ఉద్యమంలోకి రావాలని సీపీఐ(ఎం)రాష్ట్ర నాయకుడు బీరెడ్డి సాంబశివ అన్నారు. మరిపెడలో జరుగుతున్న పార్టీ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు రెండో రోజు ఆయన హాజరై మాట్లాడారు. రాజకీయ పరిస్థితులను ఎదుర్కొనేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయి యువత ఉగ్రవాదం వైపు అడుగులు వేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. శిక్షణ తరగతుల్లో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, అలువాల వీరయ్య, సూర్నపు సోమయ్య, ఉపేందర్, శ్రీనివాస్, కందనూరి కవిత, సత్యవతి, మధుసుదన్, బానాల రాజన్న పాల్గొన్నారు.

అవార్డుతో మంద కృష్ణకు తగిన గుర్తింపు



మాట్లాడుతున్న విశ్వనాథ్

నెహ్రూసెంటర్: ముప్పై ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన సేవలకు అత్యున్నత పురస్కారం ‘పద్మశ్రీ’ అవార్డును మంద కృష్ణమాదిగను వరించడంతో తగిన గుర్తింపు లభించిందని ఎంఎస్‌పీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం చాగంటి రమేశ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అవార్డు అందుకుని వరంగల్‌కు వస్తున్నందున ఈనెల 31న వరంగల్‌లో భారీ సన్మాన సభ నిర్వహిస్తున్నామన్నారు. సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షురాలు ఎండి. రజియా, కత్తుల రేణుక, అబ్బూరి వినోద్‌రెడ్డి, చలగోల వెంకన్న, పోలెపాక ప్రవీణ్, మిడతపల్లి యాకయ్య, ఎండీ పాష, మణెమ్మ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న మునీశ్వర్

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సివిల్ సప్లయి హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో నిర్వహించిన ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలో వారు మాట్లాడారు. సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను కుదించి, కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని, హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు రేషనపల్లి నవీన్, మంద భాస్కర్, చొప్పరి శేఖర్, కాసు సాయి చరణ్, పెరుగు కుమార్, వీరవెల్లి రవి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కోతకు గురైన రోడ్డు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికుంటతండా, ఎల్లారిగూడెం గ్రామాలకు వెళ్లే రహదారి కల్వర్టు వద్ద పెద్ద గుంత ఏర్పడింది. గత ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షానికి రహదారి కోతకు గురైంది. అప్పటి నుంచి రహదారిలో భారీ గుంత నోరు తెరుచుకుని ఉంది. 8 నెలలు గడిచిన గుంతను పూడ్చిన దాఖలాలు లేవు. ఆ రహదారిలో ప్రయాణించే వాహనదారులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ప్రమాదంగా ఉన్న గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మహత్యాయత్నం

గార్ల: పురుగుమందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం కేశోత్ తండాలో చోటుచేసుకుంది. గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రి వైద్యుడి కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం కేశోత్‌తండాకు చెందిన 30 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి కలుపు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా ఖమ్మం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

గూడూరు: మండల కేంద్రంలోని రైతు ఆగ్రోస్ సేవ కేంద్రంతోపాటు ఆగ్రోస్ రైతు సేవ కేంద్ర గాజులగట్టు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎండీ.అబ్దుల్‌మాలిక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వీరన్న

మహబూబాబాద్: లయన్స్ (ఇంటర్నేషనల్ 320ఎఫ్) క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ బి.వీరన్నను ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి క్లబ్ మానుకోట నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ రాజ్‌కుమార్, ఏకాంబ్రం, కార్యదర్శిగా పర్కాల రవీందర్ రెడ్డి, కోశాధికారిగా కరుణాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం

మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజ్మీరా వెంకన్న

నెహ్రూసెంటర్: లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మహబూబాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోడగుట్ట తండాకు చెందిన అజ్మీర వెంకన్నను నియమిస్తున్నట్లు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ బోడ లక్ష్మణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ సోమవారం తెలిపారు.

సీపీఐ మండల కార్యదర్శిగా బాలకృష్ణ



మరిపెడ: సీపీఐ మండల కార్యదర్శిగా మండలంలోని నీలికుర్తి గ్రామానికి చెందిన మారగాని బాలకృష్ణ రెండవసారి ఎన్నికయ్యాడు. మరిపెడలో జరుగుతున్న సీపీఐ మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కుమార్తెకు తలకొరివి పెట్టిన తల్లి

మహబూబాబాద్ రూరల్: కుమార్తెకు తల్లి తలకొరివి పెట్టిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన నాగవెల్లి సాంబమూర్తి, దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండవ కుమార్తె సృజన అనారోగ్యంతో చెందగా కుమారుడు శ్రీనివాస్ వివాహం ఇటీవల జరగగా అతడు తలకొరివి పెట్టేందుకు వీలులేకపోయింది. దీంతో కుమార్తె సృజనకు తల్లి సరోజన తలకొరివి పెట్టింది. సంఘటన చూసిన మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు, స్థానికులు బోరున విలపించారు.

క్రీడాకారుడికి సన్మానం



దోర్నకల్: మండలంలోని చాప్లాతండాకు చెందిన జాతీయస్థాయి అండర్–19 కబడ్డీ క్రీడాకారుడు ధారావత్ మల్హూర్‌ను సోమవారం మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ సర్పంచ్ బానోత్ పాండునాయక్ సన్మానించారు. ఇటీవల హైదరాబాద్‌లో అంతర్జాతీయ శిక్షణ శిబిరానికి ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్నాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



కేసముద్రం: మండంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కేతిరి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం గేదెను మేపేందుకు ఊరి చివరనున్న పంటభూముల వద్దకు తీసుకెళ్లాడు. గేదె మేసుకుంటూ విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. దాని విలువ రూ.30వేలు ఉంటుందని బాధిత రైతు విలపించాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంతోనే గేదె మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

నేడు పంటలసాగుపై అవగాహన

బయ్యారం: పంటలసాగు విధానంపై మంగళవారం బయ్యారం సొసైటీ ఆవరణంలో మల్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంజీ సోమవారం తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్వీ కన్వెన్షన్‌హాల్‌లో రామకృష్ణ విద్యాలయంలో 2000–01 బ్యాచ్ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు కలుసుకొని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుండోజు దేవేందర్, ఉపాధ్యాయులు మహేందర్, కృష్ణమాచారి, రాజేశ్వర్, అలీ పాల్గొన్నారు.

అన్నదానం

కేసముద్రం: మైసూరు అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ 83వ పుట్టిన రోజు సందర్భంగా మున్సిపాలిటీలో శ్రీదత్త హ్యూమన్ సర్వీసెస్ వలంటీర్లు, దత్తభక్తుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, మదూరి లింగమూర్తి, డాక్టర్ ఏకాంతం, విజయభాస్కర్‌రెడ్డి, ఉప్పుల వంశీకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివిస్తే ఉజ్వల భవిష్యత్



గార్ల: పెద్దకిష్టాపురం గ్రామంలో బడిబాట..

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం ఎంపీపీఎస్ హెచ్‌ఎం జి.వీరభద్రం వినూత్న రీతిలో సోమవారం ఉపాధి పని ప్రదేశాల వద్దకు వెళ్లి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తామని, తమ పిల్లలను బడుల్లో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రామ, స్వాతి, అంగన్వాడీ టీచర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: ప్రభుత్వ బడులను బలోపేతం చేసి కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌ఎం బొమ్మరాతి సాయిలు తెలిపారు. మండలంలోని శ్రీరామగిరి, రామన్నగూడెం గ్రామాల్లో సోమవారం బడిబాట నిర్వహించారు.

జీలుగ విత్తనాలతో రైతుకు మేలు



కురవి: విత్తనాలు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి



కేసముద్రం: పంపిణీ చేస్తున్న చైర్మన్ సంజీవరెడ్డి

కురవి: పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెరుగుతుందని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మరిపెడ ఆత్మకమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం సీరోలు మండలం కాంపల్లి సొసైటీలో ఇస్లావత్ సుధాకర్, కురవి సొసైటీలో సుధాకర్‌రెడ్డి రైతులకు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగు విత్తనాలను సరఫరా చేశారు. కార్యక్రమంలో ఏఓలు చాయారాజ్, నరసింహారావు, ఏఈఓ రాజేశ్వరీ, సొసైటీ సిబ్బంది జితేందర్, డైరెక్టర్‌లు గోరు రాజన్న, సంజీవ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, చందూలాల్ పాల్గొన్నారు.

కేసముద్రం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో వెంకన్న, కేసముద్రం, ధన్నసరి పీఏసీఎస్‌ల వైస్‌చైర్మన్‌లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, రావుల మురళీ పాల్గొన్నారు.

పెద్దవంగర: పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ స్వామి నాయక్ కోరారు.సోమవారం మండల కేంద్రంతో పాటు చిట్యాల, అవుతాపురం గ్రామాల్లోని రైతు వేదికల్లో పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై విత్తన బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఏఈఓ యశస్విని, నాయకులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో రైతువేదికలో తొర్రూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బట్టు నాయక్, మండల వ్యవసాయ అధికారి వాహినితో కలిసి రైతులకు సోమవారం జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మెంబర్ సంజీవరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఉదయ్‌కిరణ్, దీక్షిత్ కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దోర్నకల్: డోర్నకల్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఈఓలు అవినాష్, అనూష తెలిపారు. గొల్లచర్ల సొసైటీలో పంపిణీ చేసినట్లు ఏఈఓలు పవన్, చరణ్ తెలిపారు.

చిన్నగూడూరు: వరి సాగు చేసే నేలలో జీలుగు విత్తనాలు చల్లడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి రాబట్టడమే కాకుండా రైతులకు మేలు జరుగుతుందని ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జీలుగు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: మానవ అక్రమ రవాణా నిర్మూలించడం అందరి బాధ్యత అని డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలిఏంజిల్స్ స్కూల్‌లో సోమవారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండల సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండురోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ హాజరై మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది బాలికల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. సమాజంలో ఆడపిల్లలను రక్షించుకోవాలని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ విజయకుమారి, ప్రజ్వల కోఆర్డినేటర్ మల్లేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, సిబ్బంది మిథాలిరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడో?



బ్రిడ్జి నిర్మించాల్సిన ఆకేరు వాగు

నర్సింహులపేట: మండలంలోని జయపురం నుంచి మునిగలవేడుకు ఆకేరు వాగు నుంచి వెళ్లడానికి బ్రిడ్జి లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 10 సంవత్సరాల నుంచి నాయకులు బ్రిడ్జి వస్తుందని చెబుతు కాలయాపన చేస్తున్నారు. వాగు అవతల చాలా మందికి రైతులకు వందలాది ఎకరాల భూమి సాగు చేస్తున్నారు. వాగు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మిస్తే కష్టాలు తీరుతాయని రైతులు చెబుతున్నారు. జయపురం నుంచి మునిగలవేడు మీదుగా తొర్రూరు, మహబూబాబాద్‌తోపాటుగా పలు గ్రామాలకు రవాణా సులభంగా మారనుంది.